క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మంగళగిరి: మండల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు విద్యుత్ శాఖ ఏడీఈ సంజీవరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పెదవడ్లపూడి, కొత్తపాలెం, రేవేంద్రపాడు, కాజ, ఎన్ఆర్ఐ ఆసుపత్రి వెనుక, నూతక్కి, రామచంద్రాపురం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా అంతరాయం కలుగుతుందని వినియోగదారులు గమనించి సహకరించాలని పేర్కొన్నారు.

తాడికొండ: విద్యుత్ లేన్ల మరమ్మతుల కారణంగా మండలంలోని అన్ని గ్రామాల పరిధిలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈఈ ఎన్ నాగ మల్లేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి, సహకరించాలని పేర్కొన్నారు.

పసుపు రైతులు హాజరు కావాలి

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల గ్రామ పరిధిలోని శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్‌లో దగ్ధమైన పసుపు పంటకు చెందిన రైతులు తప్పనిసరిగా కోల్డ్ స్టోరేజ్ వద్దకు హాజరు కావాలని రైతు సంఘం నాయకులు జొన్న శివశంకరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన ఉండవల్లిలోని తన కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. కోల్డ్ స్టోరేజ్‌లో దగ్ధమైన పసుపు పంటను పరిశీలించేందుకు హైదరాబాద్ నుంచి ఫోరెన్సికల్ ఫైర్ ఆఫీసర్ ఈ నెల 16,17 తేదీలలో రానున్నారని, ఈ కోల్డ్ స్టోరేజ్‌లో పసుపు నిల్వ చేసి నష్టపోయిన రైతులు.. నిల్వచేసిన బాండ్లు, బ్యాంక్ ఖాతా పుస్తకం, ఆధార్, పట్టాదారు పాసుపుస్తకం తీసుకురావాలని పేర్కొన్నారు. రైతులకు రైతు సంఘం ఎప్పుడూ అండగా ఉంటుందని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

రెవెన్యూ సదస్సుకు 45 అర్జీలు



ఫిరంగిపురం: మండలంలోని యర్రగుంట్లపాడు గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. అడంగల్, పట్టాదారు పాసు పుస్తకాలకు సంబంధించి ప్రజల నుంచి 34, భూమి కొలతకు సంబంధించి 11, మొత్తం 45 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ జె.ప్రసాదరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు జె.శ్రీనివాసరావు, శ్రీనివాసరావు, అబ్దుల్ రెహమాన్, శివనాగరాజు పాల్గొన్నారు.

బేజాత్పురం(తాడికొండ): మండలంలోని బేజాత్పురంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో మొత్తం 6 అర్జీలు అందినట్లు తహసీల్దారు కె.నాసరయ్య తెలిపారు. ఆర్ఐ హనుమంతరావు పలువురు వీఆర్వోలు, సర్వేయర్, సిబ్బంది పాల్గొన్నారు.

జంగిల్ క్లియరెన్స్

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ఉండవల్లి జేఎస్ఎన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పలు ప్రాంతాల్లో జంగిల్ క్లియరెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉండవల్లి హరిజనవాడ కరకట్ట, సాయినగర్ కరకట్ట, వర్క్‌షాప్ వెంబడి ఉన్న పిచ్చి మొక్కలను జేఎస్ఎన్ అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 3 కిలోమీటర్ల మేర తొలగించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధినేత జొన్న శ్రీనివాసరావు, టీఎస్ఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు రాయపూడి కిరణ్, సంకురు ప్రశాంత్, డి.చైతన్య పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం



బడేపురం(తాడికొండ): మహిళ మృతి చెందడంతో..ఆ కుటుంబానికి సెయింట్ పాల్స్ సొసైటీ రూ.10 వేలు ఆర్థిక సాయం శుక్రవారం అందజేసింది. తాడికొండ శివారు బడేపురం గ్రామానికి చెందిన ఆవుల కోటేశ్వరరావు భార్య చెంచమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. సొసైటీ అధ్యక్షుడు బెజ్జం సాయి ప్రసాద్, గ్రామ పెద్ద కాలిశెట్టి శివయ్య నగదును బాధిత కుటుంబానికి అందజేశారు. బెజ్జం రాజేష్, పాలడుగు సురేష్, బోరుగడ్డ ఏలియా పాల్గొన్నారు.

కోడిపుంజు విషయంలో వాగ్వివాదం..దాడి

భట్టిప్రోలు: కోడిపుంజు విషయంలో ఇరువురు వాగ్వివాదానికి దిగి దాడి చేసుకున్న వైనమిది. భట్టిప్రోలు ఎస్ఐ ఎం.శివయ్య కథనం ప్రకారం గురువారం మండలంలోని పెదలంక మధ్యగూడెంకు చెందిన కొల్లూరు నవీన్ తన కోళ్లను అదే గ్రామానికి చెందిన నన్నెపాముల దివ్య కుమార్ తీసుకువెళ్లాడని తెలిసి అడిగితే అసభ్య పదజాలంతో తిట్టడమే కాక దాడి చేసినట్లు తెలిపారు. దాడికి గురైన ఫిర్యాదు దారుడు నవీన్ రేపల్లె ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ ఇచ్చిన స్టేట్‌మెంట్ ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు శుక్రవారం ఎస్ఐ తెలిపారు.

రైతన్న కోసం పోరుబాటలో పయనం

కలెక్టరేట్ వద్ద నిరసనకు తరలి వెళ్లిన వైఎస్సార్ సీపీ శ్రేణులు



మంగళగిరి సమన్వయకర్త వేమారెడ్డి ఆధ్వర్యంలో తరలి వెళ్తున్న కార్యకర్తలు

మంగళగిరి: రైతన్న కోసం పోరుబాటకు వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు గుంటూరు జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చేందుకు మంగళగిరి నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు శుక్రవార భారీగా తరలి వెళ్లారు. నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా గుంటూరు కలెక్టర్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా వేమారెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో వ్యవసాయం దండగగా మారిందన్నారు. వ్యవసాయం దండగ అన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతులకు ప్రభుత్వం నుంచి ఏ సాయం అందకుండా మోసం చేస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో రైతులకు ఎన్నో హామీలిచ్చిన చంద్రబాబు నేడు వారిని నిలువునా ముంచారని ఆరోపించారు. కనీస గిట్టుబాటు ధర ఇవ్వకపోవడంతో రైతులను దళారులు, వ్యాపారులు తక్కువ ధరకు ధాన్య కొనుగోలు చేస్తూ.. మోసం చేస్తున్నారన్నారు.

మంగళగిరిలో ఇంగ్లాండ్ బౌద్ధ భిక్షువు



ఆనంద జ్యోతి భంతేతో కృష్ణార్జునరావు

తాడేపల్లిరూరల్ : ఇంగ్లాండ్‌కు చెందిన బౌద్ధ భిక్షువు ఆనందజ్యోతి భంతే మంగళగిరి బుద్ధ విహార అధ్యక్షుడు రేకా కృష్ణార్జునరావు నివాసానికి శుక్రవారం విచ్చేశారు. కృష్ణార్జునరావు కుటుంబ సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆనంద జ్యోతి 1992లో ఇంగ్లాండ్ నుంచి శ్రీలంక వెళ్లి.. అక్కడ బౌద్ధ ధర్మాన్ని అధ్యయనం చేసి, భిక్షువుగా మారారని కృష్ణార్జునరావు తెలిపారు. నాటి నుంచి ఆయన శ్రీలంక, థాయ్‌ల్యాండ్, మయన్మార్, మలేషియా, భారతదేశంలోని అనేక బౌద్ధ క్షేత్రాలను దర్శిస్తూ.. ఆయా క్షేత్రాల ఔన్నత్యాన్ని అధ్యయనం చేసి, గ్రంథస్తం చేస్తున్నారని తెలిపారు.

తుళ్లూరులో విద్యుత్, విజిలెన్స్ తనిఖీలు



వివరాలు వెల్లడిస్తున్న విద్యుత్ ఈఈ సీహెచ్ వెంకటేశ్వరరావు

తాడికొండ: తుళ్లూరు మండలంలో శుక్రవారం విద్యుత్ శాఖ, విజిలెన్స్ విభాగం అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. 12 గ్రామాల పరిధిలో 35 బృందాలుగా విడిపోయి 2822 సర్వీసులను తనిఖీ చేశారు. ఇందులో 236 సర్వీసులు అధిక లోడుగా గుర్తించి రూ.95 వేల జరిమానా విధించినట్లు విజిలెన్స్ ఈఈ సీహెచ్ వెంకటేశ్వరరావు తెలిపారు. 2 సర్వీసులకు విద్యుత్ చౌర్యం కేసు నమోదు చేసి రూ.55 వేలు జరిమానా, ఒక సర్వీసు తీసుకొని ఇంకొక దానికి వాడుతున్న 5 సర్వీసులకు రూ.10 వేలు జరిమానా విధించినట్లు చెప్పారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడితే 94408 12263, 9440 812361 నంబర్‌లకు సమాచారం అందించాలని ఆయన సూచించారు. స్థానిక సూపరింటెండెంట్ ఇంజినీర్ పి.సుబ్రహ్మణ్యం, ఏఈ చిలకరాజుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడుల్లో అమరావతి ఈఈ జె.సంజీవరావు ఏడీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లుల దహనం



తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి సుందరయ్య నగర్‌లో విద్యుత్ బిల్లులను శుక్రవారం సీపీఎం నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు తాము అధికారంలో వస్తే కరెంటు చార్జీలు పెంచమని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన వెంటనే కూటమి ప్రభుత్వం ట్రూ అప్ చార్జీల పేరుతో రాష్ట్ర ప్రజలపై రూ.18 వేల కోట్ల భారాన్ని మోపిందని ఆరోపించారు. పెంచిన చార్జీలను ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. 2000లో బషీర్‌బాగ్‌లో చంద్రబాబు ప్రభుత్వం హయాంలో జరిగిన విద్యుత్ ఉద్యమాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి సభ్యులు కొట్టే కరుణాకర్‌రావు, నాయకులు సీహెచ్ భుజంగరావు, కె.ప్రభాకర్ రావు, బి.రామారావు, ఎస్కే బాషా, కె. కొండ బాబు, ఎం.లక్ష్మి పాల్గొన్నారు.

దోషులను శిక్షించాలి

ఐద్వా తాడేపల్లి పట్టణ, రూరల్ కమిటీల డిమాండ్

తాడేపల్లిరూరల్ : ఎంటీఎంసీ పరిధిలోని కొలనుకొండ గ్రామంలో ఈ నెల 10న మౌనిక మృతి అనుమానాస్పదంగా ఉందని, ఈ ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం తాడేపల్లి పట్టణ, రూరల్ అధ్యక్షులు దొంతిరెడ్డి విజయలక్ష్మి, పి.గిరిజ, కార్యదర్శులు కారసాల స్వాతి, కొండపల్లి యశోద శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. మృతురాలు మౌనిక భర్త రాజా రవీందర్ వృత్తి రిత్యా పోలీస్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడని తెలిపారు. వీరికి ఆరేళ్ల పాప ఉందని, భార్య చనిపోయిన విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియనీయకుండా గుట్టుచప్పుడు కాకుండా దహన సంస్కారాలు జరిపించారని ఆరోపించారు. మౌనిక మృతిపై పలు అనుమానాలు వ్యక్తం చేశారు. మౌనిక ఆత్మహత్య చేసుకుందా? లేక హత్యకు గురైందా అనే అంశంపై పోలీసులు విచారణ చేపట్టి, నిజాలు తేల్చాలని డిమాండ చేశారు.

కిశోర బాలికల వికాసంపై అవగాహన సదస్సు

తెనాలిరూరల్: కిశోర బాల్లి వికాసంపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం స్థానిక కొత్తపేటలోని రామకృష్ణకవి కళా క్షేత్రంలో నిర్వహించారు. ఐసీడీఎస్ తెనాలి ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడి, ఇతర శాఖల సిబ్బందికి నిర్వహించిన సదస్సుకు సీడీపీవో ఎం. సునీత అధ్యోత వహించారు. ఎంపీడీవో అత్తోట దీప్తి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. 11 నుండి 18 ఏళ్ల వయసులో ఉన్న బాలికల వికాసం గురించి అన్ని శాఖలు సంయుక్తంగా కృషి చేయవలసిన అవసరం ఉందన్నారు. బాలికలలో రుతుక్రమ పరిశుభ్రత, పౌష్టికాహారం, మానవ అక్రమ రవాణా, బాలలపై లైంగిక నేరాల నుండి రక్షణ చట్టం, బాల్య వివాహ నిషేధ చట్టం, బాలల హక్కులు, స్వీయ రక్షణ, యోగ, జీవనోపాధి అవకాశాలు వంటి వాటి ప్రాముఖ్యతపై అవగాహన కల్పించి శిక్షణనిచ్చారు. జిల్లా డీసీపీవో విజయ్ కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఓ. సౌజన్య, హిమబిందు, ఎస్ఏ నాగమణి, ఎంపీహెచ్ఓ రాజయ్య, మండల స్థాయి ఐసీడీఎస్ సెక్టార్ సూపర్వైజర్లు యానాదమ్మ, వెంకట రమణ, గ్రామ/వార్డు స్థాయి మహిళా పోలీసులు, వార్డు/గ్రామ వెల్ఫేర్ అసిస్టెంట్లు, అంగన్‌వాడి కార్యకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ప్రభుత్వం కార్మికులకు న్యాయం చేయాలి



దీక్ష నిర్వహిస్తున్న ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు

తాడేపల్లిరూరల్ : ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు ప్రభుత్వం న్యాయం చేయాలని సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. శుక్రవారం బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు తమకు రావాల్సిన బకాయిలను యాజమాన్యం చెల్లించాలని కోరుతూ నిర్వహిస్తున్న రిలే దీక్షా శిబిరానికి ఆయన విచ్చేసి, మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ కోర్టు తీర్పుల ప్రకారం ప్రభుత్వం కార్మికులకు న్యాయం చేయాలని, ప్రస్తుత మంత్రి నారా లోకేష్ ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీని నెరవేర్చే దిశగా అడుగులు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ కన్వీనర్ కూరపాటి స్టీవెన్, ఏనుగుల రమాదేవి, సారమ్మ, ఇమాంబి, మల్లె శివకుమారి, వేముల లక్ష్మి, తుపాకుల దుర్గ భవాని, బి.అంకయ్య, ఎం.ఆశీర్వాదం, కె.ఆదినారాయణ, సూర్య ప్రకాష్, ఎస్కే ఖాసిం, ఎస్కే బాష, ఎండి రహమతుల్లా, ఇమాంబి, రమణ, బుజ్జి, లక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా పెంతకోస్తు చర్చి వార్షికోత్సవం



ప్రసంగిస్తున్న బర్నబాస్ సజ్జా

తాడేపల్లిరూరల్ : మంగళగిరి పార్క్ రోడ్డు 5వ లైన్‌లోని హోలీ లార్డ్ పెంతకోస్తు చర్చి 33వ వార్షికోత్సవం నిడమర్రు రోడ్డులోని అరవింద హైస్కూల్ గ్రౌండ్‌లో శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక ప్రార్థనలో ప్రముఖ దైవ సేవకులు బర్నబాస్ సజ్జా పాల్గొని దైవ సందేశాన్ని అందించారు. చర్చి అభివృద్ధి చెందుతూ వస్తోందని సంఘ పాస్టర్ పి.తిమోతి అన్నారు. కె.లాజర్, సురేష్, జాయి నిస్సి ఆలపించిన గీతాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జనసేన మంగళగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి, ఏపీ మెడికల్ సర్వీసెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, పాస్టర్ పి. కొర్నేలి అన్న, పాస్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఏబీఎస్ మని, జాన్ లూయిస్, పాతూరి అరుణ్ కుమార్, జి.శామ్యూల్ ప్రసాద్, ప్రభు కుమార్, మహేష్, జోసెఫ్, మైఖేల్ పాల్ పాల్గొన్నారు.

రైతుల కోసం.. ఎడ్ల బండి కట్టి..



ఎడ్ల బండితో యువ రైతు నవీన్‌రెడ్డి

ఫిరంగిపురం: రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, పంటకు మద్దతు ధర కల్పించాలని శ్రీ సత్యసాయి జిల్లా, పరిగి మండలం, శాసనకోట గ్రామానికి చెందిన యువ రైతు నవీన్‌రెడ్డి తన ఎడ్ల బండిపై ఫార్మర్ ట్రావెల్ 77 పేరుతో యాత్ర కొనసాగిస్తున్నారు. ఈ యాత్ర శుక్రవారం మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా నవీన్ రెడ్డి మాట్లాడుతూ తనకు రెండెకరాల పొలం ఉందన్నారు. గత నెల 18న తన గ్రామం నుంచి ప్రయాణిస్తూ.. అనేక గ్రామాల్లో రైతులను పలకరిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికి వరకు 200 కిలోమీటర్లు పైగా ప్రయాణించానని వెల్లడించారు. రైతులు ప్రతి వస్తువును అధిక ధరలకు కొంటున్నారని, కానీ, తన పంటను మాత్రం గిట్టుబాటు విక్రయించుకోలేకున్నాడని తెలిపారు. మంగళగిరి వరకు వెళ్లి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను కలిసి, ఆయన దృష్టికి రైతులు సమస్యలను తీసుకువెళ్లనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని కోరారు.

సామాజిక పింఛన్లను పునరుద్ధరించాలి

తాడికొండ: సీఆర్డీఏ పరిధిలోని పారిశుద్ధ్య కార్మికులు, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, అసెంబ్లీ, సచివాలయం, హైకోర్టు హౌస్ కీపింగ్ కార్మికులకు నిలిపివేసిన సామాజిక పెన్షన్లు పునరుద్ధరించాలని సీఐటీయూ రాజధాని డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రవి, ఎం భాగ్యరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం తుళ్లూరు సీఆర్డీఏ ప్రాంతీయ కార్యాలయం ఎదుట మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు వేతనాలు సరిపోక నానా ఇబ్బందులు పడుతున్నారని, మంత్రి లోకేష్, ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్‌లకు అర్జీలు అందజేసినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకొని కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజధాని ఏరియా పారిశుద్ధ్య కార్మిక సంఘం నాయకులు సీహెచ్ సుశీల, ఎల్ సుఖవేణి, కుశాల రావు, రత్నకుమారి, అంకాల రాజు, రజినీ, నారాయణ పాల్గొన్నారు.

బాలల సంరక్షణ అందరి బాధ్యత

తాడికొండ: బాలలకు కనీస అవసరాలు అందే విధంగా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎంపీడీవో కె.సమతావాణి పేర్కొన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో కిశోరి వికాసంపై మండల స్థాయి శిక్షకుల సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రసంగించారు. మండల పరిధిలో బాల్య వివాహాలు జరగకుండా, బాలలు హింసకు గురికాకుండా అవగాహన కల్పించాలన్నారు. ఈ బాధ్యత ప్రతి సచివాలయ సిబ్బందిపై ఉందన్నారు. 9 అంశాలపై శిక్షణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఫిరంగిపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో జీపీ ప్రసూన మాట్లాడుతూ బాలలపై జరుగుతున్న శారీరక, మానసిక, లైంగిక హింస వేధింపులు, వివక్ష అరికట్టాలని పిలుపునిచ్చారు. ఎంఈఓ తెనాలి ఇందిర, ప్రొటెక్షన్ ఆఫీసర్ దుర్గా భవాని, ఈవోఆర్డీ కె.సాయిలీల, చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ కో–ఆర్డినేటర్ జి వెంకట్, సూపర్ వైజర్‌లు తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు



దోమల నివారణకు ఫాగింగ్..

రేపల్లె రూరల్: పట్టణంలో దోమల నివారణకు ప్రత్యేక దృష్టి సారించినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ చెప్పారు. దోమల నివారణకు ఏర్పాటు చేసిన ఫాగింగ్ వాహనం, మిషన్‌ను పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. మలేరియా, డెంగీ, చికెన్ గున్యా తదితర వ్యాధులకు కారణమైన దోమలను నియంత్రించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఫాగింగ్ నిర్వహణకు అత్యాధునిక యంత్రాలను కొనుగోలు చేసి నిత్యం పట్టణంలో సంచరించేలా చర్యలు చేపట్టామన్నారు. ప్రజలు సైతం తమ పరిసరాలలో దోమల నివారణకు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు, టీడీపీ నాయకుడు అనగాని శివప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా విద్యుత్ వినియోగం నేరం

డీఈఈ రాజశేఖర్



మాట్లాడుతున్న డీఈఈ రాజశేఖర్

కొల్లిపర: విద్యుత్ మీటర్ ద్వారా వినియోగదారులకు అనుమతి ఇచ్చిన విద్యుత్ వినియోగం కంటే ఎక్కువగా విద్యుత్ వినియోగించటం, అక్రమంగా విద్యుత్ వినియోగించటం చట్టపరంగా నేరమని అటువంటి వినియోగదారులపై కేసులు నమోదు చేసి పెనాల్టీలు వేయటం జరుగుతుందని విద్యుత్ శాఖ డీఈఈ రాజశేఖర్ అన్నారు. మండలంలోని తూములూరు, కొల్లిపర గ్రామాల్లో అధికారుల ఆదేశాల మేరకు గురువారం రాత్రి ఆకస్మికంగా విద్యుత్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల సబ్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ తనిఖీలు నిర్వహించగా 50 మంది విద్యుత్ వినియోగదారులపై కేసులు నమోదు చేసి వారికి సుమారు రూ.2 లక్షలు అపరాధ రుసుమును విధించినట్లు తెలిపారు. వినియోగదారులు మండలంలో విద్యుత్ బిల్లులు కట్టించుకొనే బిల్లుకలెక్టర్ గడువు ముగిసిపోవటంతో ఈనెల రావటం లేదు మేం ఎలా బిల్లులు కట్టాలి అని తనిఖీ కి వచ్చిన డీఈఈవో దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన వెంటనే స్పందించి ఉన్నత అధికారులతో మాట్లాడారు. దీనిపై ఆయన మాట్లాడుతూ ఈ విషయం ఉన్నత అధికారుల దృష్టికి తీసుకుపోగా వారు స్పందించి రేపటి నుంచి బిల్‌కలెక్టర్ నియమించినట్లు తెలిపారు. మండలంలో గతంలో ఎలాగైతే వినియోగదారులు ఆయా గ్రామాల్లో ఆయా తేదీల ప్రకారం బిల్‌కలెక్టర్ వస్తారని అతనికి యధావిధిగా విద్యుత్ బిల్లు చెల్లించవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యుత్ ఏఈ ప్రదీప్ కుమార్, సబ్ ఇంజనీర్ సత్యన్నారాయణ, సుంకర ప్రసాద్, తూములూరు లైన్‌మాన్ చల్లా ఉమామహేశ్వరరావు, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఐలా క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

తెనాలిరూరల్: తెనాలి కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్ ఆధ్వర్యంలో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్(ఐలా) నూతన సంవత్సర కోర్టు కేలండర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. స్థానిక కోర్టుల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి హరిదాసు గౌరీశంకర్, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు మండలపు వేణుగోపాలరావు గారు, జాయింట్ సెక్రటరీ అప్పల కిషోర్, సీనియర్ న్యాయవాదులు పిల్లి సుధాకర్, ఎంఎల్ జగదేశ్వరాంబ, గువ్వల పద్మావతి, ఇతర మహిళా న్యాయవాదులు, జూనియర్లు, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ సభ్యులు పాల్గొన్నారు.



మెగా జాబ్ మేళాలో ఉద్యోగాలు

తెనాలి: స్థానిక ఎన్నార్ఐ డిగ్రీ కాలేజీలో జరిగిన మెగా జాబ్‌మేళాలో డిగ్రీ ఫైనలియర్ విద్యార్థులు 111 మంది వివిధ సంస్థల్లో ఉద్యోగాలను సాధించినట్లు కాలేజీ సీఈవో సీహెచ్ ఉమామహేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. వీరిని సీఈవోతోపాటు ప్రిన్సిపాల్ ఎం.లాజర్‌బాబు, ఎన్నార్ఐ జూనియర్ కాలేజీల ప్రిన్సిపాల్స్ ఎస్.శివన్నారాయణ, కె.కృష్ణారెడ్డి, స్కూల్ డీన్ వి.కిషోర్, ట్రైనర్ టి.సాంబశివరావు, అధ్యాపకులు అభినందించారు.

ఉపాధి యూనిట్లతో ఆర్థిక స్వావలంబన



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

తెనాలి: పట్టణంలోని జైభీమ్ ఫెడరేషన్ కేంద్రకార్యాలయంలో శుక్రవారం సంఘ సభ్యులకు వ్యాపార అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాల్లో భాగస్వాములైన ఉపాధి యూనిట్లను నెలకొల్పి ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా మహిళలను ప్రోత్సహించే ఉద్దేశంతో ఏర్పాటైన సమావేశంలో జైభీమ్ ఫెడరేషన్ అధ్యక్షుడు కటెవరపు దేవానంద్ మాట్లాడారు. వివిధ వత్తులు, వ్యాపార అవకాశాలనూ ఆయన వివరించారు. బ్యాంకు మేనేజర్లు, వ్యాపార సంస్థలను సంప్రదించి, వారి సలహాలు, సూచనలను సభ్యులకు వివరించారు. జైభీమ్ ఫెడరేషన్‌లో ఉన్న ప్రతి సభ్యుడికి ఉపాధి కల్పించాలనేది ముఖ్య ఉద్దేశమని చెప్పారు. సభ్యులు ప్రతిఒక్కరూ ఏదొక వ్యాపారాన్ని ప్రారంభించి అభివృద్ధి చెందాలని సూచించారు. అవసరమైన సలహాలు, సూచనలు, సహకారాన్ని ఫెడరేషన్ అందిస్తుందని చెప్పారు.

క్రైస్తవ్యం జీవన విధానం: ఏఎన్‌యూ వీసీ



ఏఎన్‌యూ: ఆదర్శవంతమైన జీవన విధానానికి క్రైస్తవ్యం దోహదపడుతుందని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఇన్‌చార్జి వీసీ కె.గంగాధరరావు పేర్కొన్నారు. విశ్వవిద్యాలయంలోని అధ్యాపకులు, ఉద్యోగులు, పరిశోధకులు, విద్యార్థులు సంయుక్తంగా వర్సిటీ ఎదురుగా ఉన్న పాస్టరల్ సెంటర్‌లో శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. వేడుకలకు వ్యాయామ విద్య డైరెక్టర్ ఆచార్య పీపీఎస్ పాల్‌కుమార్ అధ్యక్షత వహించారు. వీసీ మాట్లాడుతూ మాట్లాడుతు క్రైస్తవ్యం మతం కాదని జీవన విధానం అని పేర్కొన్నారు. కార్యక్రమంలో రెక్టర్ కే రత్న షీలా మణి, రిజిస్ట్రార్ జి.సింహాచలం, మంగళగిరి సెంట్ పాల్స్ లూథరన్ చర్చి పాస్టర్ రెవరెండ్ ఎన్.నవీన్, యూజీసీ కో ఆర్డినేటర్ వై.అశోక్ కుమార్, మాజీ ఓఎస్‌డీ విష్ణువర్ధన్, వికాస అధ్యక్షుడు ఎన్.ప్రసాద్, కార్యదర్శి జవ్వాజి శ్రీనివాసరావు, డెప్యూటీ ఇంజినీర్ కె.సుబ్బారావు మాట్లాడారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు.